క్లుప్తంగా

పెద్దింటి అమ్మవారికి నల్లపూసల గొలుసు సమర్పణ



అమ్మవారికి గొలుసు అందజేస్తున్న భక్తులు

ఆకివీడు: ఆకివీడు గ్రామ దేవత పెద్దింటి అమ్మవారికి రూ.1.30 లక్షల విలువైన 12 గ్రాముల బంగారు నల్లపూసల గొలుసును స్థానిక సంతపేటకు చెందిన నెల్లి దుర్గారావు కుమారుడు వీరకుమార్, ఉమామహేశ్వరి దంపతులు సమర్పించారు. ఆలయ చైర్మన్ గొంట్లా గణపతి, ఈఓ అల్లూరి సత్యనారాయణరాజుకు నల్లపూసల గొలుసును అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దాతలను ఆలయ మర్యాదలతో వార్డు కౌన్సిలర్ కె.అరుణ కుమారి నాగరాజు సత్కరించారు.

కరపత్రం ఆవిష్కరణ



స్వాతంత్య్ర దినోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వీరన్న

భీమవరం (ప్రకాశంచౌక్): ఈనెల 31వ తేదీన అన్ని జిల్లాల్లో భారతదేశ విముక్తి సంచార జాతుల 73వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న పిలుపునిచ్చారు. ఈమేరకు ఆయన ఆదివారం భీమవరంలో కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 30వ తేదీన భీమవరం వీరమ్మ పార్కు దగ్గర డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కార్యాలయంలో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలకు సంబంధించిన సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆ సంఘ రాష్ట్ర గౌరవ సలహాదారు గంట వెంకన్న బాబు, జిల్లా నాయకులు సాలా శ్రీను, చుండూరి రాజు, చింత వీర్రాజు, చుండూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బూసికి సర్వేపల్లి రాధాకృష్ణ పురస్కారం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ బూసి వెంకటస్వామి సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. ఆదివారం వెంకటస్వామి మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాల్లో అత్యంత ప్రతిభావంతులైన వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు భాషా సాహిత్యాల్లో కృషి చేసినందుకు ఈ పురస్కారానికి ఎంపికై నట్లు తెలిపారు. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 31న గుంటూరు శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిర్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో ఈ పురస్కారం అందుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ తదితరులు అభినందనలు తెలియజేశారు.

నేడు సీనియర్ సిటిజన్స్ అష్టావధానం

నరసాపురం: పట్టణంలోని గోదావరిగట్టున ఉన్న అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి ఓ వినూత్న కార్యక్రమాన్ని నరసాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ చేపట్టింది. మొత్తంగా సీనియర్ సిటిజన్స్‌తో అష్టావధానం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉత్సాహవంతులు, తెలుగు భాషాభిమానులు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని నరసాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అందే రంగారావు ఆదివారం విలేకరులకు తెలిపారు.

జోగడకు మదర్ థెరిస్సా పురస్కారం

పాలకొల్లు సెంట్రల్: పట్టణానికి చెందిన రాహుల్ సామాజిక సేవా సంస్థ వృద్ధాశ్రమం నిర్వాహకుడు జోగాడ ఉమామహేశ్వరరావు మదర్ థెరిస్సా జాతీయ పురస్కారం అందుకున్నారు. ఆదివారం కోనసీమ జిల్లా రావులపాలెంలో సీఆర్‌సీ ఏసీ ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో పురస్కారం అందుకున్నారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తన సేవలను గుర్తించి అందించి ఈ పురస్కారం అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మదర్ థెరిస్సా ఎడ్యుకేషన్ సొసైటీ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ధ్యాన సాధనతో ఆనందమయ జీవితం

పెనుమంట్ర: జ్ఞాన సాధన ద్వారా ఆనందమయ జీవితాన్ని గడపవచ్చునని సీనియర్ పిరమిడ్ మాస్టర్ నాగ రమాదేవి అన్నారు. పెనుమంట్ర ఉప సర్పంచ్ భూపతి రాజు శ్రీనివాస్ రాజు ఆధ్వర్యంలో పిరమిడ్ కేంద్రంలో ఆదివారం ఉచిత జ్ఞాన శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగ రమ దేవిమాట్లాడుతూ సంకల్పం అంటే మన దృఢమైన ఆలోచననేనని ధ్యానం ద్వారా అద్భుతమైన ఆలోచనలు చేయగలమని తద్వారా మానసిక ప్రశాంతతను పెంపొందించుకోవచ్చునన్నారు. ఈ సందర్భంగా జ్ఞాన బోధ చేసి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సాహసం.. ఇటువైపు ప్రయాణం



జారుడుబల్లను తలపిస్తున్న స్థానిక సమతానగర్ రోడ్డు



అధ్వానంగా చినకాపవరం-రామయ్యగూడెం రోడ్డు

ఆకివీడు: ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులు అధ్వానంగా మారాయి. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని చినకాపవరం-రామయ్యగూడెం, రాజులపేట రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. స్థానిక సమతానగర్ రోడ్డు జారుడుబల్లను తలపిస్తోంది. గుంతలుగా ఉన్న ఈ రోడ్డులో గ్రావెల్ వేయడంతో రోడ్డు బురదమయమైంది. చినకాపవరం డ్రెయిన్ పొంగి ప్రవహించడంతో సమతానగర్ రోడ్డు బురదమయంగా మారిందని, ఈ రోడ్డుపై ప్రయాణం అంటేనే భయపడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. షెడ్యూల్డ్ కులాలు ఉన్న ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నా రామయ్యగూడెం రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం లేదు. దీంతో చినకాపవరం శివారు రామయ్యగూడెం, ఇతర శివారు గ్రామాలకు, చెరువుల వద్దకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందికరంగా ఉందని, రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికుడు కురెళ్ల పోలు కోరుతున్నారు.

అభయారణ్య ప్రాంతంలో.. మళ్లీ చేపల చెరువు!

ఆకివీడు: కొల్లేరు అభయారణ్య ప్రాంతంలో గతంలో కొట్టివేసిన చెరువులోకి మళ్లీ నీరు నింపి చేపల చెరువుగా మార్చుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. స్థానిక సిద్ధాపురం రోడ్డులో అటవీ చెక్‌పోస్టుకు కూతవేటు దూరంలో కాంటూర్‌లో చెరువు ఏర్పాటు చేస్తున్న ఆ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపించారు. గత వారం రోజులుగా బీడు పడిన ఆ ప్రాంతంలోని గట్లను శుభ్రపరచి, చెరువుకు ఏర్పాట్లు చేస్తున్న ఫారెస్ట్ గార్డులు ఏవిధమైన చర్యలూ తీసుకోలేదని విమర్శిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో చినకాపవరం డ్రెయిన్ గట్టుకు గండి కొట్టినట్లుగా బలమైన గట్టుకు గాడి కొట్టి చెరువులోకి నీరు నింపుతున్నారు. దీనిపై ఫారెస్ట్ రేంజర్‌కు, సెక్షన్ అధికారికి ఫిర్యాదు చేయడంతో గార్డులు ఆ ప్రాంతానికి వెళ్లి గాడిని పూడ్చినట్లు చెబుతున్నారు. అప్పటికే చెరువులోకి మూడు వంతుల నీరు నిండిపోయిందని, అభయారణ్య పరిధిలో ఏ విధమైన చెరువుల మరమ్మతులు, కొత్తగా చెరువుల్లోకి నీరు నింపకుండా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించినా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. రేంజర్ ఆచార్యులు ఆదేశాల మేరకు సెక్షన్ అధికారి రత్నరాజు ఘటనా స్థలంకు వచ్చి నీటి తోడకాన్ని, కాల్వగట్టుకు వేసిన గాడులను మూయించివేశారు. కాంటూర్ పరిధిలో ఉన్న దీనిలో ఏవిధమైన చర్యలు చేపట్టకుండా, చేపలు, రొయ్యల సాగు చేయకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వైఎస్సార్ సీపీ పోరాటం.. ప్రజాపక్షం

పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చినిమిల్లి వెంకటరాయుడు

భీమవరం అర్బన్: ప్రజల తరుపున వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తోందని, చంద్రబాబు మోసపూరిత పాలనను కలిసికట్టుగా ఎండగడదామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చినిమిల్లి వెంకటరాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని గొల్లవానితిప్ప, యనమదుర్రు గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో గ్రామ స్థాయి విస్తృత స్థాయి సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా చినిమిల్లి వెంకటరాయుడు మాట్లాడుతూ పేదలను గత వైఎస్సార్ సీపీ పాలనలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారన్నారు. కానీ చంద్రబాబు మోసపూరిత మాటలతో మభ్యపెట్టి ప్రజలు మరోసారి మోసం అధికారం కైవసం చేసుకున్నాడని మండిపడ్డారు. సూపర్ సిక్స్ హామీలతో చంద్రబాబు అధికారంలోకి వచ్చానిర, కానీ ఎంతమందికి గ్యాస్ సిలిండర్ల డబ్బులు జమ అయ్యాయో, తల్లికి వందనం ఎంతమంది అందిందో, ఉచిత బస్సు పేరుతో ఎన్ని బస్సులు తిప్పుతున్నారో రాష్ట్ర ప్రజలకు తెలుసని అందుకే ఏడాది పాలనలోనే అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత మూటగట్టుకున్నారన్నారు.



గొల్లవానితిప్పలో మాట్లాడుతున్న చినిమిల్లి. చిత్రంలో నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల

అండగా ఉంటాం

నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల మాట్లాడుతూ రాష్ట్రంలో నియంతృత్వ పాలన సాగుతుందని ఎదురించిన వారిని జైల్లో పెడుతున్నారని, ఏ ఒక్కరికి అన్యాయం జరిగినా తామంతా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. చంద్రబాబు మోసంపూరిత పాలనను ఇంటింటికి వెళ్లి వివరిద్దామన్నారు. పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు శివులూరి దత్తాత్రేయ వర్మ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసే బాధ్యత మనందరిపై ఉన్నదన్నారు. అనంతరం గ్రామ కమిటీలను నియమించి ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చిగురుపాటి సందీప్, మండల అధ్యక్షుడు జిల్లా కొండయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ ఏఎస్ రాజు, సర్పంచ్ బూరబత్తుల రామ్మూర్తి, మాజీ సర్పంచ్ బోకూరి విజయరాజు, మాజీ ఉప సర్పంచ్ తిరుమల విజయరామ్, మాజీ ఎంపీటీసీ పెనుమాల నరసింహస్వామి, కొప్పర్తి రాంబాబు, బేతాళ సంతోష్, కొల్లి పెద్దిరాజు, గుద్దటి రామాంజనేయులు, సాదే నాగరాజు, మల్లాడి నారాయణరావు, బద్దా శాంతారామ్, మెల్లా రాంబాబు, కట్టూరి యోషయ్య, తులా రాంబాబు, గూడపాటి ప్రశాంతి, గెడ్డం నరేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పెద్దెత్తున పాల్గొన్నారు.

చవితి ఉత్సవాల్లో నిబంధనలు పాటించండి

ఉండి: ఈ నెల 27వ తేదీ నుంచి నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాల్లో నిర్వాహకులు నిబంధనలు పాటించాలని ఎస్సై ఎండీ నసీరుల్లా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీజే సౌండ్స్‌కు అనుమతులు లేవని, అశ్లీల నృత్యాలను నిషేధించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి సంస్కృతీ సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ పండుగ జరుపుకోవాలని సూచించారు.

దాడి ఘటనపై ఫిర్యాదు

భీమవరం: భీమవరం ఒకటో పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఇద్దరు వ్యక్తులు ఆదివారం ఘర్షణ పడ్డారు. ఘర్షణలో తలపై రాయితో కొట్టడంతో ఒకరు గాయపడి ఆసుపత్రిలో చేరాడనే సమాచారంపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

క్రైస్తవులంతా ఐక్యంగా పనిచేద్దాం



స్థానిక హోప్‌బాప్టిస్టు చర్చివద్ద ఫీల్డ్ కౌన్సిల్‌ను సత్కరించిన దృశ్యం

ఆకివీడు: క్రైస్తవులంతా ఐక్యంగా పనిచేద్దామని, ఆస్తుల్ని పరిరక్షించుకుందామని ఈస్టు ఆకివీడు ఫీల్డ్ కౌన్సిల్ గౌరవధ్యక్షుడు డాక్టర్ గాతల డేవిడ్ లివింగ్‌స్టన్, అధ్యక్షుడు బురగా బెంజిమన్ పిలుపునిచ్చారు. స్థానిక హోప్ బాప్టిస్టు చర్చిలో నూతనంగా ఎన్నికైన కౌన్సిల్ సభ్యుల్ని ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని సంఘాల మద్దతుతో ఫీల్డ్ కౌన్సిల్ ఏర్పడిందన్నారు. కొందరు స్వలాభం కోసం చేస్తున్న ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. ఫీల్డ్ కౌన్సిల్ ఆస్తుల్ని రక్షించుకుందామన్నారు. కార్యక్రమంలో మంద ఏసేబు, కోరాడి శ్యామ్, చర్చి అధ్యక్ష కార్యదర్శులు మద్దిరాల విజయ్‌కుమార్, వెలగపల్లి సుందర్‌రావు, బేతపూడి జాన్సన్, కురెల్ల పౌలు, మద్ద ఏసేబు, దుండె ఫ్లోరెన్స్, బొడ్డు ఇంద్ర, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

యలమంచిలి: స్థానిక శ్రీ ఉమాసోమేశ్వరస్వామి ఆలయం నూతన కమిటీ ఆదివారం బాధ్యతలు స్వీకరించింది. కమిటీ చైర్మన్‌గా అడబాల శివన్నారాయణ నియమితులు కాగా మరొక తొమ్మిది మంది ట్రస్ట్ బోర్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. వీరందరితో ఆలయ కార్యనిర్వహణాధికారి నామాల సతీష్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు.

దేవస్థానం అభివృద్ధికి కృషి చేయాలి



సీసలి రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న ధర్మకర్తల మండలి సభ్యులు

కాళ్ల: నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ధర్మకర్తల మండలి సభ్యులు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని జుత్తుగ నాగరాజు అన్నారు. సీసలి గ్రామంలో వేంచేసియున్న శ్రీ అన్నపూర్ణ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం ఆలయం ప్రాంగణంలో నిర్వహించారు. దేవస్థానం చైర్మన్‌గా గణేశ్న పద్మారావు, సభ్యులుగా పి.శ్రీదేవి, ఎం.మంగతాయారు, సీహెచ్.శివనాగాంబ, బి.వీరస్వామి, టి.గోపి, ఎన్. జయలక్ష్మి, ఏ.సూర్యకుమారిలతో పాటు ఎక్స్ అఫీషియో మెంబెరుగా పి.శ్రీనివాసరావుతో దేవాదాయ శాఖ భీమవరం డివిజన్ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో కొవ్వాడ దివ్యశ్రీ, మాజీ ఎంపీపీ ఆరేటి వెంకటరత్న ప్రసాద్, కోరా రామ్మూర్తి, మాజీ సర్పంచ్ కట్రెడ్డి శ్రీనివాసరావు, నూకల భోగేంద్రబాబు, ఏఎంసీ డైరెక్టర్ వాస్కూరి శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు ఎరుబండి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలి



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న టూటౌన్ సీఐ జి.కాళీచరణ్



వినాయక పత్రిమలు, వ్రత పూజ పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే



మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని రక్షించాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం బ్యాంక్ కాలనీలోని మైత్రి కాలనీస్ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వినాయక ప్రతిమలు, వ్రత పూజ పుస్తకాలను ఎమ్మెల్యే అంజిబాబు ఉచితంగా పంపిణీ చేశారు. మట్టితో తయారు చేసిన వినాయకులతో పర్యావరణానికి ఎంతో మేలని, ప్రజలందరూ పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా కెమికల్స్ లేని మట్టి వినాయకులను ప్రతిష్ఠించి, పూజించాలని సూచించారు.

మట్టి విగ్రహాల పంపిణీ

భీమవరం: వినాయక చవితి పండుగ పురస్కరించుకుని ఇళ్లల్లో, బహిరంగం వేదికల్లో జరిగే ఉత్సవాల్లో మట్టి వినాయకుని ప్రతిమలను పూజించాలని టూటౌన్ సీఐ జి.కాళీచరణ్ అన్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సీఐ చేతుల మీదుగా మట్టి విగ్రహాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ జి.కాళీచరణ్ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల్లో రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసిన పెద్ద పెద్ద విగ్రహాలతో జల కాలుష్యమై అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. నిర్వాహకులు అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ మానవత సంస్థ గౌరవ డైరెక్టర్ పెన్మెత్స రామ్మోహన వర్మ (పూనా రాము) సౌజన్యంతో 200 మందికి ఉచితంగా వినాయక ప్రతిమలను పంపిణీ చేసినట్లు చెప్పారు. టూటౌన్ ఎస్సై రామారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు వినాయక ప్రతిమల పంపిణీ

భీమవరం (ప్రకాశంచౌక్): పర్యావరణానికి హాని చేయని మట్టి విగ్రహాలను పూజించాలని మీకోసం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్ అన్నారు. భీమవరం మెంటేవారి తోటలో ఆదివారం భగవద్గీత శిక్షణ పొందుతున్న 108 మంది చిన్నారులకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. వినాయక చవితి సందర్భంగా అందరూ మట్టి గణపతులను పూజించి, పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో చిన్నారులు మహిళలు పాల్గొన్నారు.

ఆదర్శ లయన్స్ క్లబ్‌కు అవార్డుల పంట



పాలకొల్లులో అవార్డు అందుకుంటున్న ఆకివీడు ఆదర్శ క్లబ్ సభ్యులు

ఆకివీడు: స్థానిక ఆదర్శ లయన్స్‌క్లబ్‌కు అవార్డుల పంట పండింది. పాలకొల్లులో ఆదివారం జరిగిన రీజనల్ సమావేశంలో జిల్లా స్థాయి లయన్స్‌క్లబ్‌లకు అవార్డులు ప్రదానం చేశారు. వాటిలో ఆకివీడు ఆదర్శ లయన్స్‌క్లబ్ పది అవార్డులను కై వశం చేసుకుంది. ఉత్తమ రూరల్ క్లబ్‌గానూ, ఉత్తమ అధ్యక్షురాలుగా విశ్రాంతి ఉత్తమ ఉపాధ్యాయురాలు కాకర రాజరాజేశ్వరి, ఉత్తమ కార్యదర్శిగా వైఎస్సార్‌సీపీ నాయకురాలు మోరా జ్యోతిరెడ్డి అవార్డుల్ని కైవశం చేసుకున్నారు. ఉత్తమ సిగ్నేచర్ ప్రాజెక్టు, ఉత్తమ అన్నదాన కార్యక్రమం, ఉత్తమ కంట్రీబ్యూషన్, హంగర్ రిలీఫ్, ప్రశంసలు తదితర అవార్డులు లభించాయని కార్యదర్శి జ్యోతిరెడ్డి చెప్పారు.

హమాలీ కార్మికుల పట్ల నిర్లక్ష్యం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బలరాం

భీమవరం: హమాలీ కార్మికుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి విడనాడి సమగ్ర కార్మిక చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి బలరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం భీమవరం బజార్ లాగుడు బండ్ల ముఠా కార్మిక సంఘం 29వ మహాసభ భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ హాల్ నందు యూనియన్ అధ్యక్షుడు కే వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో బలరాం మాట్లాడుతూ హమాలీ కార్మికులకు పీఎఫ్ ఈఎస్ఐ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాల వలన ఉద్యోగ కార్మికులకు పని భద్రత లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు ఐక్య పోరాటాల ద్వారా హక్కులు సాధించుకోవాలని కోరారు. ఈ మహాసభలో యూనియన్ కార్యదర్శి బి వాసుదేవరావు నివేదిక మహాసభలో ప్రవేశపెట్టారు. అనంతరం నూతన కమిటీని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. గౌరవ అధ్యక్షుడిగా బి వాసుదేవరావు, అధ్యక్షుడిగా కే వెంకటేశ్వరావు, ఉపాధ్యక్షుడిగా పిన్నింటి శ్రీను, పప్పల వెంకట సత్యనారాయణ, ఎస్ వీరుడు, ప్రధాన కార్యదర్శిగా డి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా కలిసేటి శ్రీనివాస్, ఎస్ అప్పారావు, ఎం భార్గవ, కోశాధికారి కె.కృష్ణ 18 మందితో నూతన కమిటీ ఏర్పడింది.

శిథిలావస్థలో ఆయుర్వేద వైద్యశాల





శిథిలావస్థకు చేరుకున్న వీరవాసరంలోని ఆయుర్వేద వైద్యశాల, పెచ్చులూడిన శ్లాబు

వీరవాసరం: స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. కొద్దిపాటి వర్షానికే శ్లాబుల్లో లీకులు అయ్యి గదులన్నీ నీటితో నిండిపోతున్నాయి. తలుపులు, కిటికీలు సైతం ధ్వంసమయ్యాయి. 1972వ సంవత్సరంలో కోడూరి వెంకయ్య శ్రీమతి పుల్లమ్మ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులచే అప్పటి సమితి ప్రెసిడెంట్ యరకరాజు వెంకట రామరాజు, అప్పటి గ్రామ సర్పంచ్ బోను నారాయణగార్ల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల భవనాన్ని నిర్మించారు. ఈ వైద్యశాల ద్వారా వీరవాసరం పరిసర ప్రాంతాల్లోని బాలేపల్లి, మెంటేపూడి, మత్స్యపురిపాలెం, దూసనపూడి, వడ్డిగూడెం, బొబ్బనపల్లి, మత్స్యపురి, పెర్కిపాలెం, నందమూరి గరువు, శృంగవృక్షం, శివదేవుని చిక్కాల, తోకలపూడి, చింతలకోటి గరువు రాయకుదురు తదితర గ్రామాల నుంచి వచ్చి రోగులు వైద్యం చేయించుకుంటారని ఆయుర్వేద వైద్యుడు ఎం రామచందర్ తెలిపారు. నూతన భవనం నిర్మాణం కోసం ప్రభుత్వ పెద్దలకు, అధికారులకు పలుమార్లు విజ్ఞప్తులు చేశామని, నిధుల లభ్యతను బట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు చెప్పారు.

29న నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నరసాపురం: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 29వ తేదీ శుక్రవారం ఉదయం 11.30 గంటలకు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. అజెండాలోని అంశాలతో పాటుగా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తామని వివరించారు. సభ్యులు విధిగా హాజరుకావాలని సూచించారు.

పంట కాలువలోకి ఆక్వా వ్యర్థాలు



ఆరేడులో పంటకాలువలోకి ఆక్వా వ్యర్థాలు తోడేస్తున్న దృశ్యం

ఉండి: చేపల చెరువుల్లోని వ్యర్థాలను పంట కాలువలోకి విడుదల చేస్తూ కొందరు ఆక్వా రైతులు ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. అధికారుల పర్యవేక్షణా లోపం కూడా ఇందుకు కారణంగా కనిపిస్తోంది. ఉండి నియోజకవర్గంలోని ఎన్నో చెరువులకు ఈరోజుకు కూడా అనుమతులు లేకపోవడం గమనార్హం. కొన్ని చెరువులకు అనుమతులు ఉన్నా అవన్నీ అక్రమ అనుమతులే. ఎందుకంటే చెరువు తవ్వకోవడానికి ముఖ్యంగా ఇన్‌లెట్ (చెరువులోని నీరువెళ్లే సదుపాయం), అవుట్‌లెట్ (చెరువులోని వ్యర్థాలను బయటకు విడుదల చేసేందుకు సదుపాయం) చాలా అవసరం. కానీ వాటిని అధికారులు పట్టించుకోకుండా చెరువులోకి నీరు వెళ్లేందుకు అవకాశం ఉంటే చాలు అన్నట్లు అనుమతులు ఇచ్చేశారు. కానీ ఇప్పుడు అవుట్‌లెట్‌లు లేకపోవడం వల్ల సదరు ఆక్వారైతులు తమ చెరువుల్లోని వ్యర్థాలను నేరుగా పంటకాలువల్లోకి తోడేస్తున్నారు. ఆక్వా చెరువుల్లో వాడే రసాయనాలు నేరుగా పంట కాలువల్లోకి ఆపై ఆయా పంచాంయతీల్లోని రక్షిత మంచినీటి చెరువుల్లోకి చేరి ఆ నీటిని తాగిన ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఆరేడులో ఆక్వా చెరువులోని వ్యర్థాలను నేరుగా పంటకాలువలోకి తోడేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.